క్లుప్తంగా

బగ్గందొరవలసలో పారిశుద్ధ్య పనులు



కాలువల్లో పూడిక తీతను పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన బగ్గందొరవలసలో సర్పంచ్ ఎ. నారాయణరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివారావు కూలీలతో చేయిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎండిన వరి పంట పరిశీలన



గుచ్చిమిలో ఎండిన వరిచేనును పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో ఎండిపోయిన వరిపంటను ఏఓ ఎస్.అవినాష్, ఇతర శాఖల అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ అవినాష్ మాట్లాడుతూ వర్షాలు కురవక పోవడం వలన గుచ్చిమి,చిన్నారాయుడు పేట, సీతారాంపురం గ్రామాల్లో ఎండిపోయిన వరిచేను పంటల నష్టాల్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వరిచేలు కోతకు సిద్ధం కావడంతో పంటల దిగుబడిపై పంట కోత ప్రయోగాలు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల వివరాలు వేలాడదీయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన వివరాలను సచివాలయాల్లో అందరికీ తెలిసేలా బోర్డులు విధిగా వేలాడదీయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలి సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి వారికి చేరాయా? లేదా? అనే అంశంపై గ్రామవలంటీర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికీ ఏదో రూపంలో సంక్షేమ పథకం అమలు చేసినప్పటికీ ఏవిధంగా పథకాలు వర్తించాయో లబ్ధిదారులకు తెలియ జేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందడానికి ఎవరైనా అర్హులుంటే వారు ఏవిధంగా ప్రభుత్వ సహాయం పొందవచ్చునో తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమావర్మ, సర్పంచ్ కె రాధ, కార్యదర్శి మనోహర్, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించు కోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని డబ్బివీధిలో గల కేహెచ్ మున్సిపల్ పాఠశాల వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షార్ట్‌సర్క్యూట్ తదితర కారణాలతో ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం,నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలో సేవలు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పోరాం లోని సచివాలయంలో అందిస్తున్న సేవలపై ఉద్యోగులను అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపి రిజినల్ కోర్డినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్నదొర

బొండపల్లి/మెంటాడ/సాలూరు: సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలోనే అన్ని సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావులు పేర్కొన్నారు. ఈ మేరకు మెంటాడ మండలంలోని పోరాం గ్రామంలో సామాజిక సాధికారత బస్సుయాత్రలో భాగంగా బుధవారం గ్రామంలోని సచివాలయంతో పాటు, రైతు భరోసా కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ మహిళా పోలీసులు గ్రామంలో సక్రమంగా విధులను నిర్వహిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ గ్రామంలో విధులను నిర్వహిస్తున్నామని అందుకే గ్రామంలో తగాదాలు లేవని, మద్యం అక్రమంగా విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా పోలీస్ వివరించారు. గ్రామంలో పింఛన్లు అందుకుంటున్న వారు ఎంత మంది ఉన్నారని, గతంలో ఎంత మంది ఉండేవారని? ఇప్పుడు ఎంతమందికి ఇస్తున్నామని డిజిటల్ సహాయకుడిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత గ్రామ సచివాలయం పరిధిలో ఇంతవరకు ఎంతమందికి అన్ని రకాలైన సర్వీసులను అందించారో ప్రశ్నించి తెలుసుకున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.

బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టిన గ్రామస్తులు

సామాజిక సాధికారత బస్సు యాత్రకు పోరాం గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా బస్సుయాత్రకు స్వాగతం పలుకుతూ గ్రామంలోని అర్అండ్‌బీ రోడ్డు నుంచి సచివాలయం వరకు చేపట్టిన గజపతినగరం మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల ప్రదర్శనతో పాటు, మెంటాడ మండలంలోని కంటుభుక్తవలస గ్రామానికి చెందిన మహిళల కోలాటం ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మానాపురం వరకు భారీ బైక్ ర్యాలీ

మెంటాడ మండలం పోరాం గ్రామానికి బస్సు యాత్రలో చేరుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ రాష్ట నాయకులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం గ్రామం నుంచి వందలాది బైక్‌లతో దత్తిరాజేరు మండలం, మానాపురం మీదుగా రామభద్రపురం మండలం బూశాయవలస వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, గిరిజన కార్పొరేషన్ రాష్ట చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గం పరిశీలకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వర్రావు, పి.దుర్గ, వైఎస్సార్‌సీపీ రాష్ట నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, సర్పంచ్ ఎంపీటీసీలు రాగోలు వీరమ్మ, చెల్లూరు సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక రత్నాకర్, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.



కంటుభుక్త గ్రామానికి చెందిన కళాకారుల కోలాటం



మరుపల్లి గ్రామానికి చెందిన తప్పెటగుళ్లు కళాకారుల ప్రదర్శన

సాలూరులో జనసునామీ



ర్యాలీగా వస్తున్న పాచిపెంట నాయకులు

- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- జైజగన్, జై రాజన్నదొర నినాదాలతో మార్మోగిన పట్టణం



కోలాటం ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు పట్టణం బుధవారం మధ్యాహ్నం జన సునామీని తలపించింది. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు వెల్లువలా తరలిరావడంతో యాత్ర దిగ్విజయంగా జరిగింది. సాలూరు నియోజకవర్గం నలుమూలల నుంచి పట్టణ, మండలాల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సుమారు 25 వేల మంది రాకతో పట్టణంలోని మెయిన్‌రోడ్డు కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జనంతో నిండిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా వచ్చిన జనాలు రాజన్నదొర, జగనన్న వెంటే తామంతా అంటూ నినదించారు.

కార్యక్రమం సాగిందిలా..

మెంటాడ మండలంలోని పోరాంగ్రామానికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంత్రులు పీడిక రాజన్నదొర, ధర్మాన ప్రసాదరావు, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు చేరుకుని ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అనంతరం సుమారు 4.30 గంటల సమయంలో సాలూరు పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలు చల్లి ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో అందించిన సంక్షేమం, అభివృద్ధి ఫలాలపై రాజన్నదొర సభలో క్లుప్తంగా తెలిపిన వివరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఎవరి హయాంలో నియోజకవర్గ అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు రావాలని పలుమార్లు సవాల్ విసిరానని, నేడు మళ్లీ సవాల్ చేస్తున్నానంటూ రాజన్నదొర చేసిన ప్రసంగానికి సభాస్థలి అంతా జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో మార్మోగింది. అంతకుముందు సభాస్థలి వద్ద మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సామాజిక సాధికార యాత్ర సమావేశానికి పట్టణం, మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. స్థానిక ప్రజాప్రతినిదులు, కౌన్సిలర్‌లు, నాయకులు పువ్వల ఈశ్వరమ్మ, జర్జాపు దీప్తి, వంగపండుఅప్పలనాయుడు, జర్జాపుఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు తదితరుల ఆధ్వర్యంలో కోలాటం, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సభాస్థలికి చేరుకున్నారు. పాచిపెంట మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఎంపీపీ బడ్నాన ప్రమీల, పార్టీ జిల్లా కార్యదర్శులు పాచిపెంటవీరంనాయుడు, డోలబాబ్జీ, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలోను, సాలూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాథ, మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసులనాయుడు తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టణంలోని సభాస్థలికి చేరుకుని జై జగన్, జై రాజన్నదొర నినాదాలు చేశారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



అడ్డాపుశీలలో నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం: ఈనెల 10న పార్వతీపురంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని అడ్డాపుశీల సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలంటే అనే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 9 నుంచి రాష్ట వ్యాప్తంగా వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు చేయాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సచివాలయం పరిధిలో ఎవరెవరికి ఏమేమి మంచి చేసింది, ప్రజలకు వ్యక్తిగతంగా ఏఏ పథకాలు అందజేశారు. గ్రామానికి ఏమి అభివృద్ధి చేశారు. అన్న వివరాలతో జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి వివరాలను తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై. తిరుపతిరావు, పార్టీ నాయకుడు మజ్జిశేఖర్, సర్పంచ్‌లు రామకృష్ణ, రమణ, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని 5,6,7,8,9 వార్డుల ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

'బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ఈనెల 10న పార్వతీపురంలోని పాత బస్‌స్టాండ్ ఆవరణలో నిర్వహించనున్న సామాజిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం వైకేఎం కాలనీలోపి 19వ వార్డులో, గెడ్డవీధిలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్



తాగునీరు సరఫరాకు సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

సీతానగరం: మండలంలో మంచినీటి పథకం పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం లచ్చయ్యపేటలో పూర్తి కావచ్చిన ఓవర్‌హెడ్‌ట్యాంక్‌కు పంప్‌ద్వారా లోడ్ చేసిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లచ్చయ్యపేటలో రూ.14 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటి కుళాయిల కోసం ట్యాప్‌లు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ ఇంటింటి కుళాయిలకు మంజూరుచేసిన నిధులు చాలక పోవడంతో గ్రామ పంచాయతీ నిధులతో ఇంటింటి కుళాయి పనుల సంఖ్య పెంచినట్లు తెలిపారు. రెండురోజుల్లో ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా అవసరమైన తాగునీరు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే త్వరలో బుడ్డిపేటలో ఇంటింటి కుళాయిల పనులు ప్రారంభించడానికి ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మిగతాగ్రామాలకు ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. సూరంపేట పంచాయతీలో ఇంటింటి కుళాయి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కోట సీతారాంపురంలో బోరు మరమ్మతులకు గురవడంతో కొత్తగా బోరు తీయించి ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు.

శ్రమదానంతో చెరువు సుందరీకరణ



సుందరవనంగా తీర్చి దిద్దుతున్న మంచినీరు కోనేరు

సీతానగరం: యువత తలంచుకుంటే సాధ్యం కానిది ఏదీలేదని రుజువు చేస్తున్నారు సీతానగరం మండలంలోని అంటిపేట యువకులు. రాష్ట రహదారిని ఆనుకుని ఉన్న చరిత్ర కలిగిన అంటిపేట మంచినీరు కోనేరులో స్నానాలు చేయడం వల్ల చర్మవ్యాధులు మటుమాయమై ఆరోగ్యవంతంగా ఉంటామన్న నమ్మకం గ్రామస్తుల్లో ఉంది. గ్రామ ప్రజల కోరిక మేరకు పంచాయతీ పాలకులు తాగునీరు సమస్యలేకుండాలన్న సంకల్పంతో మంచినీరు కోనేరులోనే బావిని నిర్మించి తాగునీటి ఎద్దడిని నివారించారు. ప్రధానంగా రోడ్డు మీదుగా నాటుబళ్లతో ప్రయాణం చేసేవారు, రైతులు చెరువు గట్టుపై కూర్చుని సేదతీర్చుకుని అన్నం తినేవారు. అటువంటి చరిత్ర కలిగిన కోనేరు గట్టున పిచ్చిమొక్కలు, రాత్రి పూట ప్రజలు బహిర్భూమిగా వినియోగించడాన్ని గ్రామంలోని యువకులు గుర్తించారు. ఈ క్రమంలో కోనేరును పరిరక్షించుకోవాలన్న తపనతో గ్రామానికి చెందిన యువకులు 180 మంది కమిటీగా ఏర్పడి సొంత నిధులు లక్షలాది రూపాయలు సమకూర్చడం పాటు శ్రమదానంతో కోనేరు సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.నిర్మల గ్రామ యువత చేపట్టిన కోనేరుగట్టు అభివృద్ధి పనులతో పాటు కోనేరుకు మెట్లు కట్టే పనులను బుధవారం పరిశీలించారు.

గిరిశిఖర ప్రజలకు ప్రత్యేక భోజన సదుపాయం



మరిపల్లిలో భోజనం చేస్తున్న గిరిశిఖర ప్రజలు

సాలూరు: పట్టణంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర కోసం ఉదయాన్నే గిరిశిఖర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక భోజన సదుపాయం కల్పించారు. సాలూరు మండలానికి సంబంధించి మండలంలోని మరిపల్లి సమీపంలో వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భోజన సదుపాయం కల్పించారు. ప్రియతమ నేత రాజన్నదొర కోసం తాము గిరిశిఖర గ్రామాల నుంచి ఉదయాన్నే లేచి వచ్చామని గిరిజనులు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

సాలూరు: మండలంలోని దేవుబుచ్చింపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేయనున్న కారణంగా సాలూరు, పాచిపెంట మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ కిశోర్‌కుమార్ తెలిపారు. మెయింటనెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి, సహకరించాలని కోరారు.